ఘనంగా ఈ ఛాంప్స్ గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న చిన్నారులు

కుత్బుల్లాపూర్: సుచిత్రలోని నారాయణ పాఠశాలలో బుధవారం ఈ ఛాంప్స్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ జే.హేమలత అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు సరిఫికేట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ సాయి ప్రకాశ్, ఏజీఎం పురుషోత్తం, ఆర్ అండ్‌డీ హెడ్ శర్వాణి, కో–ఆర్డినేటర్ దీప్తి, వైస్ ప్రిన్సిపాల్ ప్రతిభ, చంద్రశేఖర్, శేఖర్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిర్ వాల్వ్ గ్రిల్ ధ్వంసం



గాంధీనగర్ రోడ్డులో ధ్వంసమైన ఎయిర్ వాల్వ్ గ్రిల్

రంగారెడ్డినగర్: లోప్రెషర్ సమస్య తలెత్తకుండా తాగునీటి సరఫరా సజావుగా కొనసాగేందుకు ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్వ్‌లపై పర్యవేక్షణ కొరవడింది.. పలు ప్రాంతాల్లో ఎయిర్ వాల్వ్‌లకు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయకపోగా, కొన్ని ప్రాంతాల్లో గ్రిల్స్ ఏర్పాటు చేసినా వాహనాలు ఢీకొట్టడంతో ధ్వంసమవుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుపై ఉన్న ఎయిర్ వాల్వ్ గ్రిల్‌ను ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గ్రిల్ ధ్వంసమైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి .గ్రిల్‌కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై తనిఖీ



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న జలమండలి మేనేజర్ రవి

చింతల్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని చింతల్ సెక్షన్ జలమండలి మేనేజర్ రవి అన్నారు. బుధవారం వెంకటేశ్వరనగర్ రోడ్డు నెంబరు–5లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను ఆయన పరిశీలించారు.. డ్రైనేజీ లైన్ ఏర్పాటు సమయంలో సరైన లెవలింగ్ లేకుండానే పైపులైన్ పనులను పూర్తి చేయడంతో తరచూ డ్రైనేజీ పొంగి పొర్లుతోందని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పైపులైన్‌ను పరిశీలించిన మేనేజర్ రవి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న గొల్ల జాన్, బొంగులూరి కిషోర్‌రెడ్డి

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బుధవారం ఎన్ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐడీపీఎల్ చౌరస్తాలో గొల్ల జాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ వ్యవస్థాపకురాలు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొంగులూరి కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు, వారి హక్కులను కాపాడేందుకు ఎన్ఎస్‌యూఐ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. యువత క్రియాశీలక రాజకీయాల్లోకి రావడానికి ఎన్ఎస్‌యూఐ అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పృథ్వీ, సాయి, కిరణ్, అనూప్ తదితరులు పాల్గొన్నారు.



సాయినగర్‌లో అసంపూర్తిగా నిలిచిన డ్రైనేజీ పనులు

ఏడాదైనా.. పూర్తికావా..?

సాయినగర్‌లో మూడు నెలలుగా నిలిచిపోయిన డ్రైనేజీ పనులు

తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిసర కాలనీల ప్రజలు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు 2కిలో మీటర్ల దూరం వరకు డ్రైనేజీ పనులను రూ.6కోట్ల నిధుల అంచనాతో ప్రారంభించారు. పనులు మొదలై ఏడాదైనా పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. తుర్క చెరువు నుంచి ఆదిత్య గార్డెన్, సాయినగర్ మీదుగా ఆర్‌కే లేవుట్, ట్రిబుల్ ఆర్ వైన్స్ వరకు 900 డయా పైపు లైన్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కానీ తుర్క చెరువు నుంచి సాయి నగర్ వరకు మాత్రమే పనులు పూర్తయ్యాయి. సాయినగర్ కాలనీ మధ్య మసీదు వరకు వచ్చి పనులు నిలిచిపోయాయి. గతంలో ఉన్న చిన్న డ్రైనేజీ పైపులైన్‌ను తొలగించి 900 డయా లైన్ వేస్తుండటంతో రోడ్డు మొత్తం తవ్వి పైపులు వేసి పనులు మధ్యలో వదిలేశారు. గత మూడు నెలలుగా ఈ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్య మాత్రం తీరడం లేదు. పనుల్లో వేగం పుంజుకోవడం లేదని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలల నుంచి రోడ్డు బంద్.

మూడు నెలల క్రితం నుంచి సాయినగర్ మసీదు ముందు ఉన్న రోడ్డులో డ్రైనేజీ పనులు ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడంతో రోడ్డు మొత్తం బంద్ అయ్యింది. కాలనీకి ఇది ప్రధాన రోడ్డు కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అయ్యింది. ప్రజలు తమ తమ వాహనాలను ఇంటి వరకు తీసుకువెళ్లాలన్న అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.స్కూల్ పిల్లలను బస్సు ఎక్కించాలన్న నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వృద్ధులు అయితే ఈ రోడ్డులో నడవలంటే బయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా అనేక రకాలుగా రోడ్డు మొత్తం గుంతలతో ఉండటంతో ప్రజలు ప్రతి రోజు పడరాని పాట్లు పడుతున్నారు.

తెగిపోయిన నీటి పైపులైన్ కనెక్షన్లు...

జేసీబీలతో రోడ్డు తవ్వే క్రమంలో మంచినీటి కనెక్షన్లు మొత్తం తెగిపోయాయ.దీంతో జలమండలి పంపిణీ చేసే నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు నీటి కనెక్షన్లు తిరిగి ఇవ్వకపోవడంతో వేసవి కాలంలో నీటి కోసం సైతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఏదుర్కొంటున్నారు. అంతే కాకుండా పైపులైన్లు తెగిపోవడంతో బహిరంగంగా పారుతున్న మురుగు నీరు సైతం నీటి పైపులైన్లలోకి వెళ్లే ప్రమాదం కూడా పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నీటి కనెక్షన్లను ఇవ్వాలని కోరుతున్నారు.



ఇళ్ల నుంచి మ్యాన్‌హోల్‌లోకి వెళ్తున్న మురుగు నీరు

నేరుగా వదిలేస్తున్నారు..

గతంలో ఉన్న డ్రైనేజీ లైను మొత్తం తవ్వేయడంతో ఇండ్ల నుంచి వచ్చే మురుగు నీరు మ్యాన్ హోల్స్ వరకు బహిరంగంగా పారుతుంది. పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తమ తమ ఇంటి నుంచి మ్యాన్ హోల్ వరకు పైపులైన్ వేసుకోలేని పరిస్థితి.ఇంటి నుంచి వెళ్లాల్సిన మురుగు నీరు తప్పని పరిస్థితిలో మ్యాన్ హోల్స్‌కు రంధ్రాలు చేసి అందులోకి వదిలే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో మురుగు నీరు బహిరంగంగా పారుతుండటంతో పరిసర ప్రాంతాలు దుర్గంధంగా మారుతున్నాయి. వేగంగా పనులు పూర్తి చేసి రోడ్డు మొత్తం చదును చేస్తే తమకు ఇన్నీ ఇబ్బందులు ఎదురయ్యేవి కావని స్థానికులు వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం...



డ్రైనేజీ పనులు ప్రారంభించినప్పటి నుంచి చాలా ఇబ్బందులు పడుతున్నాం. పెద్ద డ్రైనేజీ పైపు లైన్ పనులు చేసేటప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకుని చేయాలి. రోడ్డును తవ్వి కొన్ని రోజులు వదిలేశారు. పైలులు వేసి మరికొన్ని నెలలు పనులు ఆపేశారు. ఇలా కాంట్రాక్టర్ ఇష్టం వచ్చినట్లు పనులు చేస్తే ఎట్లా.? ప్రజల ఇబ్బందులు కూడా ఆలోచించాలి కదా.

– అక్బర్, సాయినగర్

నోటీసులు ఇచ్చాం...



సాయినగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ పనులు వేగంగా పూర్తి చేయడం లేదనే ఫిర్యాదులు చాలా వచ్చాయి. ఇప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. స్పందించకపోతే టెండర్ రీకాల్ చేస్తాం. ప్రజల ఇబ్బందులు పరిష్కారించేందుకే మేము ఉన్నాం. పనులు వేగంగా పూర్తి చేసేందుకు తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– సాబేర్ అలీ, కమిషనర్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్

త్వరగా పూర్తి చేయండి...



డ్రైనేజీ పనులు ప్రధాన రోడ్లపై చేసే సమయంలో వేగంగా పూర్తి చేయాలి కాని నెలల తరబడి ఇలా పెండింగ్‌లో పెడితే తమకు ఎన్ని ఇబ్బందులు ఏదురవుతాయో అధికారులు ఒకసారి ఆలోచించాలి. డ్రైనేజీ గుంతల్లో పడి ఇప్పటికే చాలా మందికి గాయాలు అయ్యాయి. ఇటివల పడ్డ వర్షానికి గుంతలన్నీ నీటితో నిండిపోయాయి. చిన్న పిల్లలు అందులో పడితే ఎంతటి ప్రమాదం .అధికారులు ఇప్పటికైన వెంటనే చర్యలు తీసుకోవాలి.

– రహమాన్, సాయినగర్

ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చండి



రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

జీడిమెట్ల: సుభాష్‌నగర్ వెంకటాద్రినగర్‌లో రోడ్డు మలుపులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌పార్మర్‌ను పక్కకు మార్చాలని స్థానికులు కోరుతున్నారు. వెంకటాద్రినగర్‌లోని ప్రధాన రోడ్డులో ట్రాన్స్‌పార్మర్ రోడ్డుపైకి ఉండటమేగాక విద్యుత్ తీగలు రోడ్డుపై వేలాడుతూ ఉన్నాయి. వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలిచి విద్యుత్‌షాక్ తగిలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు జోక్యం చేసుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



షాపు నిర్వాహకుడికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

దుండిగల్: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్‌లో భాగంగా బుధవారం పలు కిరాణా షాపులు, హోటల్స్, రెస్టారెంట్లపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ టీంలను ఏర్పాటు చేసి సింగల్ యూస్ ప్లాస్టిక్ వాడే, కిరాణా షాపులు, హోటల్స్ , చికెన్ మటన్ దుకాణాలపై దాడులు చేసి జరిమానా విధించారు. ప్లాస్టిక్‌కు బదులు జ్యూట్ బ్యాగులు, చేతి సంచులు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ బి లక్ష్మయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి సాత్విక్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తున్న మాజీ కార్పొరేటర్ దివాకర్

నిజాంపేట్ : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్ అన్నారు. బుధవారం ఆయన అధికారులతో కలిసి ఎన్‌ఆర్‌ఐ కాలనీ, చందు లేఅవుట్‌లో అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చే ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. స్థానికంగా చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువాలని కోరారు. అనంతరం ఎన్‌ఆర్‌ఐ కాలనీలోని ఆవిష్కార్ కాలేజ్ రోడ్డు పనులు ప్రారంభించారు.

అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయండి

జీడిమెట్ల: పారిశ్రామికవాడలో రోడ్డుపై వాహనాల అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. జీడిమెట్లలోని ఫేజ్–5రోడ్డులో గత కొన్నేళ్లుగా ఓస్టీల్ పరిశ్రమ ముందు నిత్యం లారీలను నిలుపుతున్నారు. దీంతో ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.ఈ కారణంగా ట్రాఫిక్‌జాం ఏర్పడుతుందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయమై పలుమార్లు ఐలా అధికారులకు, ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న వాహనాలకు చలానాలు విధించి సదరు స్టీల్ పరిశ్రమ యాజమాన్యానికి నోటీసులు ఇవ్వాలని కోరతున్నారు.



రోడ్డుపై నిలిపిన లారీలు

చెరువుల్లో మురుగు నీరు చేరకుండా చర్యలు



చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ ఉదయ్ భాస్కర్

దుండిగల్: చెరువుల్లో మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈ ఉదయ్ భాస్కర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని చెరువులను ఇరిగేషన్ అధికారులతో కలిసి సందర్శించారు. నిజాంపేట మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు మల్లంపేటలోని కొత్తకుంట, చెన్నం చెరువుల్లో చేరుతుందని బీజేపీ నాయకుడు ఎంబరి ఆంజనేయులు అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన డీఈ ఉదయ్ భాస్కర్ బుధవారం ఆయా చెరువుల్లో కలుస్తున్న మురుగు నీటిని పరిశీలించారు. మరో మూడు రోజుల్లో మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ సురేందర్ నాయక్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

జగద్గిరి గుట్ట డీఐగా నరేందర్ రెడ్డి

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ బుధవారం సీపీ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న అంజయ్యను రాజేందర్‌నగర్ ఎస్‌ఓటీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో సైబర్ క్రైమ్స్‌లో పని చేస్తున్న నరేందర్‌రెడ్డిని డీఐగా నియమించారు. పేట్‌బషీరాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న సుంకర విజయ్‌ను చందానగర్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. అయన స్థానంలో సైబర్ క్రైమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న అజయ్‌కుమార్ పేట్‌బషీరాబాద్ డీఐగా నియమించారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని, సంబంధిత పోలీస్‌స్టేషన్లలో బదిలీ అయిన అధికారులు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

అక్రమ షెడ్డు కూల్చివేత



షెడ్డును కూల్చివేస్తున్న అధికారులు

దుండిగల్: నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని కేఎల్‌హెచ్ యూనివర్సిటీ సమీపంలో అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నారు. గతంలోనే సదరు నిర్మాణదారులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా నిర్మాణం కొనసాగిస్తుండటంతో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి సంజున నేతృత్వంలో మున్సిపల్ సిబ్బంది షెడ్డును కూల్చి వేశారు. మరో సారి నిర్మాణం చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వంట గ్యాస్ ధరను తగ్గించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం షాపూర్‌నగర్ రైతుబజార్ నుంచి శుభం హోటల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించిన అనంతరం రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 ఏళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు గ్యాస్ ధరను ఇష్టానుసారంగా పెంచి ప్రజలపై భారం మోపుతుందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బి.సత్యం, దేవదానం, డి. కరుణాకర్, రావుల స్వాతి, జి వెంకన్న, భాష దుర్గనాయక్, యాదవరెడ్డి, నర్సింహులు, గోపి, సాదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి

నిజాంపేట్ : ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహన్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములను కాపాడాలని ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో బుధవారం ఆయన డివిజన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని సూచించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కుత్బుల్లాపూర్: సీఎం సహాయనిధి నిరుపేదలకు అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన దుంపటి కిషన్ రూ.52 వేలు, కాడలి దుర్గాప్రసాద్ రూ.40 వేలు, ముచర్ల రమాదేవి రూ.30 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. సదరు చెక్కులను బుధవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో శ్రీశైలంగౌడ్ లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించడమే రేవంత్‌రెడ్డి ఆశయం అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, సంజీవ్ కుమార్, అరుణ్ కుమార్, మాక్బుల్, మోటే శ్రీనివాస్, సూర్యానారాయణ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

ఎస్ఎఫ్‌సీ స్థలంలో డ్రోన్ సర్వే

సుభాష్‌నగర్: గాజులరామారంలోని సర్వే నంబర్ 307 లోని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్థలాన్ని బుధవారం హైడ్రా సిబ్బంది రెవెన్యూ అధికారులతో కలిసి డ్రోన్ సాయంతో సర్వే నిర్వహించారు. 2007లో అప్పటి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం 271 ఎకరాల 39 గుంటల స్థలాన్ని అప్పగించింది. చుట్టూ కొంత స్థలం కబ్జాకు గురై సదరు స్థలంలో నిర్మాణాలు వెలియడంతో హైడ్రాకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో హైడ్రా సిబ్బంది డ్రోన్ సహాయంతో సర్వే నంబర్ 307 లో సర్వే నిర్వహించారు.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్‌కు విశేష స్పందన



పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

నిజాంపేట్ : రాజాంగ పరిరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్‌కు విశేష స్పందన లభిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 18,19వ డివిజన్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ హన్మంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 6వ రోజు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు, అభివృద్ధిని ప్రజలు వివరిస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తుందో ప్రజలకు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్‌రెడ్డి, కోలన్ బాల్‌రెడ్డి, కమ్మెట నారాయణ, డీలర్ శంకర్, కె.రాజేందర్, కోలన్ జీవన్‌రెడ్డి, అశోక్, శెట్టి జీతయ్య, కోలన్ ప్రశాంత్‌రెడ్డి, జిత్తు, టిల్లు, నాని, సందీప్, రాము పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE : MEDCHAL COURT : AT MEDCHAL
E.P. No. 18 OF 2016
IN
O.S. No. 572 OF 2012

Between : M/s. Margadarsi Chit Fund Pvt.Ltd., Himayathnagar Branch.
...Decree Holder
And
Mr Kurian Mathew & Others..
...Judgement Debtors.

To.
Mr. Kurian Mathew. S/o. Mathew Manalumpara, R/o. H.No.3-99, Gandi Maisamma X Road, Quthbullapur (Mandal), R.R.District. JDR NO.1

TO WHOMSOEVER IT MAY BE CONCERN

In the above mentioned E.P., the below mentioned property is brought for Sale to realize the Decree Debt Rs.10,63,812/-. Auction is going to be held on 15.04.2025 at Court premises at 10.30 A.M. Therefore, whoever is interested in purchasing the property can attend and participate in bid which is opened to one and all.

SCHEDULE OF PROPERTY BELONGING TO JDR NO.1 MR.KURIAN MATHEW REGD VIDE SALE DEED NO.5771/1998, DT. 22.10.1998

SCHEDULE "B" PROPERTY

All that the Plot bearing Nos.28, 29 & 30 admeasuring 270.00 Sq.Yards or 225.72 Sq Mtrs, in Sy. Nos. 178/A & 214 Situated at Dommar Pochampally Village, Quthbullapur Mandal, Ranga Reddy District, which comes under the Grampanchayat / Municipality Dommar Pochampally, Sub-Dist. Medchal, Regd-Dist. Ranga Reddy registered under the Joint S.R.O.-Medchal, Medchal District and bounded as follows - NORTH : Land Of J.C. Mathur, SOUTH : Naighbor's Land, EAST : 20' Wide Road, WEST : Land Of J.C.Mathur.

// BY ORDER OF THE COURT //
Sd/- B.MAHESH BABU, ADVOCATE
PLOT NO.147, HAKIM PET, SHAMIRPET MANDAL